క్లుప్తంగా

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కంచికచర్ల: పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని పెండ్యాల గ్రామం బీసీ కాలనీ నుంచి వీరులపాడు మండలం జయంతి గ్రామానికి వాహనం ద్వారా అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల(52బస్తాలు) రేషన్ బియ్యాన్ని కీసర గ్రామంలో పట్టుకుని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న లారీ డ్రైవర్ నంద్రు సతీష్ బాబును అదుపులోకి తీసుకున్నామని, బియ్యాన్ని కొనుగోలు చేసిన కాజా సత్యనారాయణపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ శంకర బాబు ఆదివారం తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు దాఖలు చేసుకోవచ్చని, స్పందనలో వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం


నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన కోనేరు పుష్కరిణి వద్ద ఆక్రమణల తొలగింపు కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది.గత కొద్దిరోజులుగా కోనేరు ప్రక్షాళనపై దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.ఆక్రమణలు తొలగిస్తున్న సందర్భంలో పురాతన శివాలయం బయటపడడంతో కోనేరు ఆక్రమణల తొలగింపు వేగవంతం చేశారు. రాబోయే కార్తికమాసం నాటికి కోనేరుకు పూర్వ వైభవం తెచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఆక్రమణ దారులు సైతం సహకరిస్తున్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



నందిగామ: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్‌హెచ్‌ఓ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పుడు ఏం చేసేదీ కూడా తాము గమనిస్తూనే ఉన్నామని, కాబట్టి సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పండుదొర, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒప్పంద కార్మికురాలు మృతి



గన్నవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటనపై ఆదివారం గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం...మండలంలోని బుద్దవరం గ్రామానికి చెందిన దుంపల నాగమణి(35), ఆమె భర్త వెంకటేశ్వరరావు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన డ్యూటీకి వెళ్లేందుకు ఇంటి నుంచి బైక్‌పై ఇద్దరూ బయలుదేరారు. అజ్జంపూడి వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన వ్యాన్ బైక్‌కు తగిలి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

రైతులకు వెన్నుదన్ను... ఆర్‌బీకేలు

- గ్రామంలోనే అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- రైతులకు అన్నిరకాల సేవలు ఆర్‌బీకేలలోనే..




మండలంలోని జమ్మవరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా సొంత గ్రామాలలోనే రైతులకు అన్ని సేవలు అందిస్తూ రైతు నేస్తాలుగా మారాయి. గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయటంతో రైతులు తమ సొంత గ్రామాలలోనే అన్ని సేవలు పొందుతున్నారు. ముఖ్యంగా భూసార పరీక్షలు నిర్వహించటం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

రాయితీపై ఎరువులు, విత్తనాలు


గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం రాయితీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తోంది. దీంతో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కోసం మండల కేంద్రాలకు వెళ్లి వ్యయప్రయాసలకోర్చి తెచ్చుకునే పని తప్పిందని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బీకేలలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాల ద్వారా రైతులు తమ పేర్లు నమోదు చేయించుకుని తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను 48 గంటల్లో పొందగలుగుతున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్‌లను సైతం ప్రభుత్వం రాయితీపై అందిస్తుండటంతో రైతుల వదనాల్లో చిరునవ్వులు పూస్తున్నాయి.



మేలు చేస్తున్న ఈ–క్రాప్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ–క్రాప్ నమోదు రైతులకు మేలు చేస్తుంది. ప్రతి రైతు తాను సాగు చేసిన పంటలకు సంబంధించిన వివరాలను ఈ–క్రాప్ ద్వారా నమోదు చేయించుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుపానుల వల్ల పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం పొందే వీలుంటుంది. ఈ క్రాప్ సర్టిఫికెట్‌తో రైతులు బ్యాంకుల నుంచి రుణాలు కూడా పొందవచ్చు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో చేపట్టే ఈ–క్రాప్ నమోదుతో మాకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే పంటల బీమా పథకం ద్వారా నష్టపరిహారం అందిస్తున్నారు. రైతులకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–షేక్ సైదా, జుజ్జూరు

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



రైతు భరోసా కేంద్రాల వల్ల తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రాయితీపై గ్రామాలలోనే అందుబాటులో ఉంటున్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా అన్నీ లభిస్తున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రాలకు వెళ్లి వ్యయప్రయాసల కోర్చి తెచ్చుకోవలసిన పని లేకుండా పోయింది.

–నన్నెబోయిన తిరుమలరావు, జమ్మవరం

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఆరవ వార్డు కాకానినగర్ లో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మనోహర్ ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణాలకు సంబంధించిన పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధుల నుంచి డ్రెయిన్‌కు, సిమెంట్ రోడ్డుకు మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని పూడ్చివేసేందుకు సుమారు రూ.3.50 లక్షల వ్యయంతో నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ఈ సమస్య పరిష్కారానికి తక్షణమే స్పందించి పనులను చేపట్టిన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ బాబు, స్థానికులు పాల్గొన్నారు.

● చెట్టంత ప్రమాదం



ఆ మహావృక్షాలు నిన్న మొన్నటి దాకా ప్రజలను కన్నబిడ్డల్లా తన ఒడిలో చేర్చుకున్నాయి. భానుడి అగ్నికీలల్లాంటి ఉష్ణ కిరణాల నుంచి కాపాడి చల్లటి నీడనిచ్చాయి. పచ్చని అందాలతో ఆహ్లాదాన్ని అందించాయి. మరిప్పుడో... వయసుడిగి, జీవం కోల్పోయి, జీవచ్ఛవంలా తయారయ్యాయి. ఎండిన కొమ్మలతో మోడులా మిగిలాయి. ఆ ఎండిన కొమ్మలు ఎప్పుడు ఏ ఈదురుగాలులకు విరిగి మీదపడతాయోనని ఇప్పుడు అదే జనం భయపడుతున్నారు. చెట్టంత ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నవాబుపేట వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిన వృక్షాల పరిస్థితి ఇది. ఇటీవల గాలులకు కొన్ని కొమ్మలు విరిగి పడ్డాయి. అయితే ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. చిల్లకల్లు-మక్కపేట రోడ్డులో రెండు రోజుల క్రితం చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు ఎండిన కొమ్మలు తొలగించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

–నవాబుపేట(పెనుగంచిప్రోలు)

దిశ యాప్ ఉంటే రక్షణ వలయంలో ఉన్నట్టే

పెద్దాపురం(వీరులపాడు): దిశ యాప్ ఉన్న మహిళలు పోలీసుల రక్షణ వలయంలో ఉన్నట్లేనని ఎస్ఐ మహాలక్ష్మణుడు అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఆదివారం దిశ యాప్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, యువతుల రక్షణ కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ యాప్‌ను రూపొందించారన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఫోన్‌లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కాళీమాతకు ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: ఆదివారం జ్యేష్ఠ మాసం అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఉన్న శ్రీ శివదుర్గా భవానీ విశ్వరూప కాళీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు తానూరి శ్రీనుస్వామి అమ్మవారికి ప్రత్యేకంగా నిమ్మకాయ దండలు, వడమాల, మల్లె పూలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీనాట్య కళానికేతన్ బృందానికి చెందిన నృత్యకారులు పలు కీర్తనలకు భరతనాట్యం ప్రదర్శించారు. అనంతరం వారు దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

కృష్ణా నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణానదిలో పిండాల ఘాట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు... కృష్ణానదిలో పిండాల ఘాట్ వద్ద ఆదివారం ఉదయం ఒక వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. స్థానికులు సచివాలయ మహిళా పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు గోల్డ్ కలర్ హాఫ్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నాడు. వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఊరు పేరు వివరాలు తెలియరాలేదు. దీనిపై మహిళా పోలీసు శ్యామలాదేవి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఒంటరితనం, మద్యం అలవాటు కారణంగా యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనపై యువకుడి అక్క ఫిర్యాదుపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బ్లాక్ నెం 220లో కందెపు నాని నివసిస్తున్నాడు. అతనికి తల్లిదండ్రులు లేరు. సింగ్ నగర్‌లో ఉండే అక్క కె.వరలక్ష్మి అండగా ఉంటోంది. నానికి వివాహం కాకపోవడం, మద్యం అలవాటు కారణంగా మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం మధ్యాహ్నం వరలక్ష్మి భర్త కిశోర్ వైఎస్సార్ కాలనీకి వచ్చి నాని ఉండే ఇంట్లో చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే వరలక్ష్మికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. స్థానికులకు తెలపగా వారు నానిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను స్పృహలో లేడు. అతనికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై బాధితుడి అక్క పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గోల్డ్ షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గొల్లపూడి మౌలానగర్‌కు చెందిన షేక్ మహ్మద్ ఇమామ్ ఓ జ్యూయలర్స్‌లో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఇంటి నుంచి వెళ్లిన మహ్మద్ ఇమామ్ తిరిగి రాలేదు. తెలిసిన వాళ్లను, బంధువులను, స్నేహితులను అడిగినా ఆచూకీ లభించలేదు.దీంతో ఇమామ్ తండ్రి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అమర గాయకులకు స్వరనీరాజనం



హనుమంతరాయ గ్రంథాలయంలో చిత్ర గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: సునీల్ ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం అమర గాయకులకు స్వరనీరాజనం, ఫాదర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం ఆలపించిన గీతాలను గాయకుడు సునీల్ ఆధ్వర్యంలో పలువురు గాయనీగాయకులు చిత్ర గీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన మారేపల్లి జోషి, జ్ఞానకిషోర్, డేవిడ్‌రాజు, ప్రవాసాంధ్ర గాయని సింధు, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. గాయకునిగా విశిష్టసేవలను అందించిన సునీల్‌కు అమెరికాకు చెందిన ప్రైవేట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భం పురస్కరించుకుని సంస్థ నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

-స్వరరాగార్చన ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన ఆపాత మధురాలు ఆకట్టుకున్నాయి.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



అమ్మవారికి పూజా సామగ్రిని తీసుకెళ్తున్న దుర్గగుడి కమిటీ చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారి సంబరం నిర్వహించామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. బ్రాహ్మణ వీధిలో దేవస్థాన పరిపాలన భవనం ఆవరణలోని జమ్మిచెట్టు వద్ద దేవతామూర్తులకు చైర్మన్ కర్నాటి రాంబాబు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి, ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని పూలు, పండ్లు, పూజా సామగ్రి, పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కట్టా సత్తెయ్య, చింకా శ్రీనివాసులు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, తొత్తడి వేదకుమారి, అనుమోలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రంలో చదువుల విప్లవం

ప్రభుత్వ విప్ ఉదయభాను



ఇంటర్ పరీక్షల్లో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన వంశీకృష్ణను అభినందిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో అనేక సంస్కరణలు చేపట్టి చదువుల విప్లవం తీసుకువచ్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఆడోతు వంశీకృష్ణ కృష్ణాజిల్లా మోపిదేవి మండలం, జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షల్లో 1000 మార్కులకు గాను 953 మార్కులతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో వంశీకృష్ణను సన్మానించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను, విద్యార్థులను ప్రోత్సహించి వారికి సమాజంలో మంచి గౌరవ ప్రతిష్ఠలు పెంచేందుకే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారని తెలిపారు. జగనన్న ఆణిముత్యాల ద్వారా అగ్రహారం గ్రామానికి చెందిన వంశీకృష్ణకు రూ.50 వేల నగదును, ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, రాష్ట్ర పేరెంట్స్ కమిటీల చైర్మన్ పెంటి శ్రీనివాసరావు, అగ్రహారం గ్రామ నాయకులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు ప్రభుత్వ సేవలు అభినందనీయం



హర్ దిల్‌మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాత్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ముస్లింలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): ముస్లింల పవిత్ర హజ్ యాత్రకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన చొరవ ముస్లింలకు చిరస్థాయిగా గుర్తుంటుందని జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అక్సా మసీదులో ఆదివారం ముస్లింలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హజ్‌యాత్రకు ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, గతంలో ఏ ప్రభుత్వం కూడా హజ్ యాత్రకు ఇటువంటి సౌకర్యాలు కల్పించలేదని గుర్తు చేశారు. ముస్లింలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. అనంతరం మసీదులో నెలకొన్న సమస్యలను ముస్లింలు వినతిపత్రం ద్వారా తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ షాఉద్దీన్, మసీదు ప్రెసిడెంట్ బాషా, కార్యదర్శి మీరాసాహెబ్, కోఆప్షన్ మాజీ సభ్యుడు ఫిరోజ్‌ఖాన్, ముస్లిం పెద్దలు నాగుల్‌మీరా, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ గోపీకృష్ణ మృతి బాధాకరం



వీఆర్‌ఏ గోపీకృష్ణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: చిన్న వయసులోనే గుండె పోటుతో వీఆర్‌ఏ బింగి గోపీకృష్ణ మృతి చెందటం బాధాకరమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. పట్టణంలోని గోపీకృష్ణ నివాసంలో మృతదేహాన్ని ఆదివారం ఆయన సందర్శించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోపీకృష్ణ మండలంలోని లచ్చపాలెం వీఆర్‌ఏగా పని చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని పథకాలను సకాలంలో అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం గోపీకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వయోవృద్ధ సేవలు నిరుపమానం



వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ ఈశ్వర్, ట్రస్ట్ సభ్యులు, దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జి.ఈశ్వర్ అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలు నిండి, ఎవరూ పట్టించుకోని వయోవృద్ధులను గుర్తించి గత 192 నెలలుగా వారికి నిత్యావసర సరుకులు అందజేయడం, ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. వయోవృద్ధులను ఆదరించటం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. జైన్స్ అందిస్తున్న సేవలను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని చెప్పారు. ఇంత మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్‌సంఘం సెక్రటరీ పన్నాలాల్ డీ జైన్ వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి ట్రస్ట్ ద్వారా అందజేస్తున్న సేవలు వివరించారు. అనంతరం దాత మహేంద్ర హోజరీ సెంటర్ సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు కార్యక్రమంలో మోడ్రన్ కేఫ్ అధినేత మురళీధర్, ట్రస్టీలు తట్టి అర్జునరావు,ఎన్వీయూ సతీష్‌కుమార్, కె. మధుసూదనరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.